ఘనంగా భోగభాగ్యాల భోగి



భోగి మంట కాగుతున్న వరికూటి అశోక్‌బాబు, ఆయన సతీమణి లక్ష్మి



మోపాడులో భోగి మంటలు



గుడ్లూరులో..



కందుకూరు పట్టణంలోని 60 అడుగుల రోడ్డులో..



పామూరు ఎన్‌జీవో కాలనీ వద్ద..



సీఎస్‌పురం: భోగి మంట కాగుతున్న వైస్ ఎంపీపీ ప్రభంజన



పొన్నలూరు భోగి మంటలు వేస్తున్న యువకులు



కొండపిలో..

పామూరు: భోగి పండగ వేడుకలు పట్టణంతో పాటు మండలలోని పలు గ్రామాల్లో ప్రజలు శనివారం ఘనంగా జరుపుకున్నారు. విద్య, ఉద్యోగ, బతుకుదెరువు కోసం స్వగ్రామాల నుంచి వేర్వేరు ప్రాంతాలకు వెళ్లిన వారు తిరిగి స్వగ్రామాలకు చేరుకుని భోగి పండగను ఘనంగా నిర్వహించుకున్నారు. వేకువ జామునే నిద్ర లేచి పోటాపోటీగా కుటుంబ సభ్యులంతా కలిసి భోగి మంటలు వేశారు. ముగ్గులు, సాంస్కృతిక కార్యక్రమాలు, గంగిరెద్దులవారి విన్యాసాలు విశేషంగా అలరించాయి. స్థానిక మదన వేణుగోపాలస్వామి, వల్లీ భుజంగేశ్వరస్వామి, శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీదేవి, సత్యనారాయణస్వామి, సాయిబాబా, మహాలక్ష్మి, అయ్యప్ప ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి ఆలయంవద్ద ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో భోగిమంటల వేశారు. **టంగుటూరు:** మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలు భోగి వేడుకలు శనివారం ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారు జాము నుంచే ఇళ్ల ముందు పిలలు, పెద్దలు, మహిళలు భోగి మంటలు వేసుకున్నారు. కొంత మంది భోగి మంటల్లోనే నీరు కాచుకుని పిల్లలకు భోగి పండ్లు పోసి స్నానం చేయించి ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. జమ్ములపాలెం, పలు గ్రామాల్లో సంక్రాంతి సంబరాల ఆటల పోటీలు ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు, ఆయన సతీమణి లక్ష్మి, నాయకులతో కలిసి భోగి మంటలు వేశారు.

కొండపి: మండలంలోని అన్నీ గ్రామాల్లో భోగి పండగను శనివారం ఘనంగా జరుపుకున్నారు. గ్రామాల్లోని మహిళలు, చిన్నారులు తెల్లవారు జామునే నిద్రలేచి పెద్ద ఎత్తున భోగిమంటలు వేశారు. ఆ మంటల్లోనే నీరు కాచుకుని స్నానాలు ఆచరించారు. ఆనందంగా భోగి పండగ జరుపుకున్నారు.

మద్దిపూడి..

మండలంలోని అన్నీ పంచాయతీల పరిధి గ్రామాల్లో శనివారం సంక్రాంతి పండుగ మొదటి రోజు భోగి పండగను ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. మహిళలు తెల్లవారు జామునే లేచి ఇంటి ముంగిళ్లలో అందంగా ముగ్గులు దిద్దారు. ముందుగా సేకరించిన తాటాకులు, రేగి కంచెతో పెద్ద ఎత్తున భోగి మంటలు వేశారు. ధర్మవరంలో మండల స్థాయి క్రికెట్, మద్దిపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కబడ్డీ పోటీలు నిర్వహించారు.

కందుకూరు అర్బన్: పట్టణంలో ప్రజలు భోగి పండగను శనివారం ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని ప్రతి బజారులో, ప్రతి ఇంటి ముందు తెల్లవారు జాము నుంచే భోగి మంటలు వేసుకున్నారు. ఈ మంటల్లో ఇంట్లోని పాత వస్తువులు, విరిగిన మంచాలు, కుర్చీలు, తాటాకులతో భోగి మంటలు వేసుకుని తమ కష్టాలు తొలగించాలని ప్రజలు దేవుడిని ప్రార్థించారు. అనంతరం తమ ఇళ్ల ముందు రంగు రంగుల ముగ్గులు వేస్తూ చిన్నలు, పెద్దలు సందడి చేశారు.

హనుమంతునిపాడు: మండల వాసులు శనివారం తెల్లవారు జాము నుంచే భోగి సంబరాలు వైభవంగా జరుపుకున్నారు. భోగితో సంక్రాతి సంబరాలు ఆరంభమయ్యాయి. తెల్లవారు జము నుంచే వీధుల్లో ఇళ్ల ముంగిట భోగి మంటలు వేశారు. అందరినీ ముచ్చట గొలిపే రంగు రంగుల రంగవల్లులు వేశారు.

పొన్నలూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలు భోగి పండగను శనివారం ఉత్సాహంగా జరుపుకున్నారు. కొత్త సంవత్సరంలో తొలి పండుగ కావడంతో తెల్లవారు జాము నుంచే ప్రజలు భోగి మంటలు వేసుకుని పండగ విశిష్టతను చాటారు. తాటాకులు, ఇంట్లోని పాత వస్తువులను సైత భోగి మంటల్లో వేసి చలికాగారు. కొంత మంది భోగిమంటల్లోనే నీరుకాసి తమ పిల్లలకు భోగి పండ్లు పోసి స్నానం చేయించారు. చిన్నారులు, పెద్దలు తలంటు స్నానాలు ఆచరించి కొత్త దుస్తులు ధరించి దేవాలయాలకు వెళ్లి పూజలు చేశారు.

సీఎస్‌పురం: భోగి పర్వదినాన్ని శనివారం మండల ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. ఇళ్ల ముంగిట భోగి మంటలు వేశారు. గృహాల్లో నిల్వ ఉన్న పాత వస్తువులను భోగి మంటల్లో వేసి కాల్చివేశారు. గడిచిన పాత కాలాన్ని వదలేసి రాబోవు సంవత్సరంలో ఆనందంగా ఉండాలని కాంక్షిస్తూ ఆలయాల్లో పూజలు చేశారు. వైస్ ఎంపీపీ భూమిరెడ్డి ప్రభంజన వెంకటరెడ్డి దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి తమ స్వగ్రామం అయ్యలూరివారిపల్లిలో భోగి వేడుకల్లో పాల్గొన్నారు.

గుడ్లూరు: భోగి పండగ వేడుకలు మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలు శనివారం ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. పిల్లలు, పెద్దలు, మహిళలు, వృద్ధులు తెల్లవారు జామున 4 గంటల నుంచే భోగి మంటలు వేసుకున్నారు. ప్రతి ఒక్కరూ తలంటు స్నానాలు చేసి కొత్త బట్టలు వేసుకున్నారు. గుడ్లూరులోని నీలకంఠేశ్వర ఆలయం, విష్ణాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి శివ, కేశవుల విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి గ్రామంలో గ్రామోత్సవం నిర్వహించారు.

కందుకూరు రూరల్: భోగి పండగను కందుకూరు మండల ప్రజలు శనివారం ఘనంగా నిర్వహించుకున్నారు. మండలంలోని ప్రతి గ్రామంలో పిల్లలు, పెద్దలు, మహిళలు, యువతి, యువకులు తెల్లవారు జామున 4 గంటల నుంచే ఆనందోత్సాహాలతో భోగి మంటలు వేశారు. తెల్లవారు జామునే తలార స్నానాలు చేసి నూతన వస్త్రాలు ధరించారు. సంక్రాంతి పండగలో మొదటి రోజైన భోగి పండగను కుటుంబ సమేతంగా జరుపుకున్నారు. దూర ప్రాంతాల్లో బంధువులు, నూతన వివాహాలు చేసుకున్న అల్లుళ్లతో గ్రామాలు కళకళలాడుతున్నాయి.

వాలీబాల్ పోటీలు ప్రారంభం



వాలీబాల్ పోటీలు ప్రారంభిస్తున్న నిర్వాహకులు

పీసీపల్లి: మండలంలోని గోపవరపు వారిపల్లిలో వాలీబాల్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. నారప రెడ్డి హరీష్‌రెడ్డి జ్ఞాపకార్థం సోదరులు శ్రీనివాసులరెడ్డి, మహేంద్రరెడ్డిలు పోటీలు నిర్వహిస్తున్నారు. స్థానిక వైఎస్సార్ సర్కిల్లో వైభవంగా పోటీలు ప్రారంభమయ్యాయి.



















వినికిడి యంత్రాల పంపిణీ



మహిళకు వినికిడి యంత్రం అందజేస్తున్న నాయకులు

టంగుటూరు: మండలంలోని సూరారెడ్డిపాలేనికి చెందిన వేముల శేషమ్మ, టంగుటూరు బుచ్చిరాజుపాలెం కాలనీకి చెందిన పట్నం ఇంద్రాణి, పోతుల చెంచయ్య కాలనీకి చెందిన దేవనబోయిన పుష్పవతిలకు వినికిడి సమస్య ఉంది. ఈ విషయాన్ని గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో కొండపి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు దృష్టికి స్థానిక నాయకులు తీసుకెళ్లారు. స్పందించిన అశోక్‌బాబు వారికి వినికిడి యంత్రం అందే విధంగా చూడాలని ప్రయత్నించారు. వరికూటి సూచనల మేరకు వినికిడి యంత్రాలు ఆయా గ్రామాల నాయకుల చేతుల మీదగా బాధితులకు శనివారం పంపిణీ చేశారు. బీసీడి ఉదయకుమార్, పమిడి వీర రాఘవయ్య, తక్కెలపాటి సుధాకర్, నర్రా శ్రీనివాసులు, మన్నం వెంకయ్య, ఎంపీటీసీలు బొడ్డు వాసంతి, కొమ్ము ప్రభుదాసు, పులిచర్ల కోటయ్య, పమిడి హరికృష్ణ, దాసరి సుబ్బారావు, జిల్లా వికలాంగుల యూనియన్ పసుమర్తి రాజేష్, బొడ్డు రవీంద్ర పాల్గొన్నారు.

ఈసీజీ సేవలు ప్రారంభం



ఈసీజీని ప్రారంభిస్తున్న మాదాసి, చిరంజీవి, వెంకటేశ్వరరావు

టంగుటూరు: స్థానిక పురం సెంటర్లో స్ఫూర్తి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఉచిత ప్రజావైద్య శిబిరంలో నూతనంగా ఈసీజీ మెషీన్‌ను పీడీసీసీ బ్యాంకు చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య, తహసీల్దార్ చిరంజీవి, సంస్థ గౌరవ సలహాదారులు, ఆదాయ పన్నుల శాఖ అధికారి బొడ్డు వెంకటేశ్వరరావు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజలు సోమవారం నుంచి శనివారం వరకు ఉదయం 6 నుంచి 9 వరకు, సాయంత్రం 6 నుంచి 08.30 గంటల వరకు, ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఉచిత వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేస్తామన్నారు. ఈసీజీ పరీక్షకు కేవలం రూ.100 చెల్లించాలన్నారు. సంస్థ ప్రతినిధులు సునీల్, బుజ్జి, సురేష్, ఎంపీటీసీ వరుణ్, క్రాంతి, రాంబాబు, మోహన్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



తిరుపాల్‌రెడ్డి కుమార్తెకు ఆర్థిక సాయం చేస్తున్న చింతలచెర్వు

పీసీపల్లి: క్రీడలు మానసిక స్థైర్యాన్నిస్తాయని ఏపీ రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతలచెర్వు సత్యనారాయణరెడ్డి అన్నారు. శనివారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలోని సీఎస్ఎన్ఆర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించే క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. అనంతరం పిల్లివారిపల్లిలో అనారోగ్యంతో మరణించిన భూమిరెడ్డి తిరుపాల్‌రెడ్డి (80) కుటుంబాన్ని పరామర్శించారు. తిరుపాల్‌రెడ్డి కుమార్తె పద్మకు రూ.15 వేల ఆర్థిక సాయం చేశారు. సర్పంచ్ సంపూర్ణ, మాజీ సర్పంచ్ దుంపా మాలకొండారెడ్డి, మనోజ్, శివారెడ్డి, చిలకల సుబ్బారెడ్డి, బాలిరెడ్డి, నరసింహారెడ్డి, కొండారెడ్డి, గోవిందులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



పూర్వ విద్యార్థులతో ఆ నాటి ఉపాధ్యాయులు

మద్దిపూడి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2009–10 సంవత్సరానికి సంబంధించిన 10 వ తరగతి పూర్వ విద్యార్థుల సమ్మేళనం శనివారం కనుల పండువగా సాగింది. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు 50 మంది దాదాపు 13 ఏళ్ల తర్వాత కలుసుకుని యోగక్షేమాలు తెలుసుకుని ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. గత స్మృతులను నెమరు వేసుకున్నారు. ఎదిగిన కొద్దీ ఒదిగి ఉండాలని, పూర్వపు విద్యార్థులు ఎంత స్థాయిలో ఉన్నా తమను గుర్తు పెట్టుకుని ఇక్కడికి పిలిపించుకుని సన్మానించడం సంతోషకరమని ఉపాధ్యాయులు అన్నారు. 50 మంది పూర్వ విద్యార్థులు గిఫ్టులు పంపిణీ చేసుకుని సహపంక్తిభోజనాలు చేశారు. ఉపాధ్యాయులు రామాంజనేయులు, జానీ, మదార్‌వలి, సుధాకర్‌రెడ్డి, షకీల పాల్గొన్నారు.

ఆదిరెడ్డి సందడి



ఆదిరెడ్డి సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు

పీసీపల్లి: ప్రముఖ రియాలిటీ షో బిగ్ బాస్–6 పాత్రధారుడు ఆదిరెడ్డి శనివారం మండల పరిధిలోని పెద యిర్లపాడులో హల్‌చల్ చేశారు. గ్రామంలో జరుగుతున్న బాల్‌బ్యాడ్మింటన్ పోటీలకు ఆదిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసిక స్థైర్యం పెంపొందుతుందని, మానసిక రుగ్మతల నుంచి బయటపడవచ్చన్నారు. ఆదిరెడ్డిని సర్పంచ్ పోలం లక్ష్మీదేవి, ఎంపీటీసీ మైలా రమణమ్మ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గోపవరపు బొరారెడ్డిలు సన్మానించి షీల్డ్ బహూకరించారు. ఓకే రెడ్డి, యూత్ నాయకులు మైలా మల్లికార్జున, శ్రీనివాసులు ఉన్నారు.

ఘనంగా గోదాదేవి కల్యాణం

సింగరాయకొండ: పాతసింగరాయకొండ శ్రీ వరాహ లక్ష్మీ నరసింహాస్వామి దేవస్థానంలో శనివారం రాత్రి సంక్రాంతి వేడుకల్లో భాగంగా భోగి పండగను పురస్కరించుకుని గోదాదేవి కల్యాణం అత్యంత కనుల పండువగా జరిగింది. స్వామి వారిని, గోదాదేవిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఉదయగిరి లక్ష్మీనరసింహాచార్యులు ఆధ్వర్యంలో కల్యాణోత్సవం నిర్వహించారు. సోమవారం స్వామివారికి తెప్పోత్సవం నిర్వహించనున్నట్లు ఈఓ పి.కృష్ణవేణి వివరించారు.

కోడిపందెపు రాయుళ్ల అరెస్టు

పీసీపల్లి: కోడిపందాలు ఆడుతున్న ఇద్దరిని పోలీసులు శనివారం అరెస్టు చేశారు. మండల పరిధిలోని అన్నపురెడ్డిపల్లి శివారులో కోడిపందాలు ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న ఎస్ఐ నాగేశ్వరరావు తన సిబ్బందితో దాడి చేశారు. కోడిపందాలు ఆడుతున్న ఇద్దరిని అరెస్టు చేసి వీరి నుంచి రూ.2,400లు, 2 కోళ్లు స్వాధీనం చేసుకున్నారు.

పామూరు: మండలంలోని తిరగలదిన్నె శివారున శనివారం కోడిపందాలు ఆడుతున్న వారిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ కె.సురేష్ యాదవ్ తెలిపారు. వివరాలు.. తిరగలదిన్నె సమీపంలోని పొలాల్లో కోడిపందాలు ఆడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు సీఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి కోడిపందెం శిబిరంపై దాడులు నిర్వహించారు.



